
సాక్షి చిత్తూరు

శుక్రవారం । 5 । జనవరి । 2024



పేదలకు గృహయోగం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషంలో ఉన్నారు. - 8లో



మామిడిలో సస్యరక్షణ చర్యలు

మామిడి సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి వివరించారు. - 8లో



శ్రీవారి సేవలో శ్రీకాంత్

సినీ నటుడు శ్రీకాంత్ కుటుంబసభ్యులతో కలిసి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

6న జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి శాఖ అధికారి పద్మజ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేళాలో 4 ప్రముఖ సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. పది, ఇంటర్, ఆపై కోర్సులు పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఎంపికయ్యే వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఇస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.

సంక్రాంతి సెలవుల్లో ఎలాంటి మార్పుల్లేవు

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలలకు సంక్రాంతి సెలవుల్లో ఎలాంటి మార్పులు లేవని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఉంటాయన్నారు. పాఠశాలలకు ఈ నెల 8న చివరి పనిదినం అని చెప్పారు. పాఠశాలలు ఈ నెల 19 పునఃప్రారంభించాలని తెలిపారు. సోషల్ మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని డీఈఓ స్పష్టం చేశారు.

ల్యాబ్ నివేదికలు ఇవ్వాలి

చిత్తూరు రూరల్: ల్యాబ్ పరీక్షలను సకాలంలో పూర్తిచేసి నివేదికలు ఇవ్వాలని జిల్లా టీబీ అధికారి వెంకట ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న ప్రతి వ్యక్తికి గల్ల పరీక్షలు చేయించాలన్నారు. పాజిటివ్ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణం వల్ల విష జ్వరాలు వ్యాప్తిస్తున్నాయని, అవగాహన కల్పించాలన్నారు.

జగనన్న 'సురక్ష' పాలన



అందరికీ ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. పేదల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తోంది. మెరుగైన వైద్యం అందించేలా తపిస్తోంది. ఈ ఫలితంగా పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టింది. జిల్లా వ్యాప్తంగా తొలి విడత విజయవంతమైంది. రెండో విడత కార్యక్రమానికి సైతం ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి.

- ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఆరోగ్య సురక్ష
- విజయవంతంగా మొదటి విడత పూర్తి
- రెండో విడత సురక్షకు విశేష స్పందన
- ఇంటి ముంగిటకే వైద్య సేవలు



ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి అద్దాలు పంపిణీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి



క్యాంపును పరిశీలిస్తున్న చిత్తూరు నగర కమిషనర్ అరుణ

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. గతేడాది సెప్టెంబర్ 15వ తేదీన జిల్లాలో సురక్షను ప్రారంభించింది. దీంతో ఇంటింటా వలంటీర్లు, వైద్యసిబ్బంది సర్వే చేపట్టారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామాల్లోనే ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించారు. ఇలా జిల్లాలో నవంబరు వరకు 14,12477 మంది వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. డాక్టర్లు పల్లె, వార్డుబాట పట్టడంతో జనానికి ఇంటి పట్టునే సేవలందాయి. పలు రకాల వ్యాధులు బయటపడ్డాయి. దీంతో వారు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, వైద్యులు సమన్వయంతో మొదటి విడత సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.

రెండో విడత

జిల్లాలో జనవరి 2వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష-2 ప్రారంభమైంది. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక జబ్బులను వైద్యులు జల్లెడ పడుతున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి బుధవారం అర్బన్ ప్రాంతాల్లోనూ సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక జబ్బులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మార్పువ్యాధులు, గుండె జబ్బులను గుర్తించి మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. అంతే కాదు ఇక్కడ ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ఎంత ఖర్చయినా ఉచితంగా వైద్యం చేస్తారు.

మొదటి విడత ఆరోగ్య సురక్ష వివరాలు

క్యాంపుల సంఖ్య 494	మొత్తం ఓపీల సంఖ్య 14,12,477
రెఫర్ కేసులు 2,688	రక్తహీనత ఉన్నవారు 7,35,242
రక్తపోటు బాధితులు 10,722	నేత్ర పరీక్షలు 27,367
కళ్ల అద్దాలు తీసుకున్నవారు 17,382	కంటి ఆపరేషన్ చేసుకున్నవారు 224

రెండో విడత ఆరోగ్య సురక్ష వివరాలు

మొత్తం క్యాంపులు 567	రూరల్ 459
అర్బన్ 108	పూర్తయిన క్యాంపులు 23
ఇప్పటి వరకు వచ్చిన ఓపీల సంఖ్య 5632	కంటి వెలుగు స్క్రీనింగ్ 5632
రెఫర్ కేసులు 14	

వైద్య నిపుణులతో సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులతో ముగ్గురు ప్రత్యేక వైద్య నిపుణులుండేలా చర్యలు తీసుకున్నారు. గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ ప్రధానంగా ఉంటారు. ఈ ముగ్గురితో పాటు కంటికి సంబంధించిన డాక్టర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 567 సురక్ష క్యాంపులు జరగనున్నాయి. వీటిలో 50 పీహెచ్‌సీ డాక్టర్లు, శిబిరానికి ఇద్దరు చొప్పున ప్రత్యేక వైద్య నిపుణులు, 2 వేల మందికి పైగా పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి ఆరు మండలాలకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను ఇందులో భాగస్వాములు చేశారు. దీంతో పేద ప్రజలకు వాడవాడలా వైద్య సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు వైద్య శిబిరాలు ఉపయోగపడుతున్నాయి.

పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం. గతంలో లేనంతగా వైద్య సేవలు అందుతున్నాయి. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షిస్తున్నారు. మందులు, మాత్రలు ఉచితంగా ఇచ్చారు. ముందు చిన్న జబ్బు వచ్చినా పట్టణానికి వెళ్లేవాళ్లం. కాసులు వేల రూపాయలు ఖర్చయ్యేది.

-యమున, బలిజకండ్రిగ

సురక్ష ఉపయోగకరం



అనారోగ్యంగా ఉండడంతో క్యాంపు వద్దకు వెళ్లి పరీక్షించుకున్నా. డాక్టర్లు మంచిగానే చూసి మందులు, మాత్రలు రాసిచ్చారు. ఆ మాత్రలు కూడా క్యాంపు ఆవరణలోనే ఉచితంగా ఇచ్చి పంపించారు. ఊరికి డాక్టరు రావడం ఎప్పుడూ చూడలేదు. ఏ రాష్ట్రంలోనే లేదు. మన రాష్ట్రంలో మాత్రమే ఇలా మారుమూలన ఉన్న ఊర్లకు డాక్టర్లు వస్తున్నారు. మాలాంటి వాళ్లకు సురక్ష ఉపయోగకరం.

-పంకజ్, గుడిపాల

కంటి అద్దాలు ఇచ్చారు



కంటి సమస్య ఉందని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లాను. అక్కడి డాక్టర్లు పరీక్షించారు. కంటి సమస్య ఉందని నిర్ధారణ చేశారు. తర్వాత కంటి అద్దాలు ఇచ్చారు. ఇందుకు రూపాయి ఖర్చు లేదు. అక్కడ ఇక్కడ తిరగాల్సిన పనిలేదు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఉంటే రూ.వేలల్లో ఖర్చు అయి ఉండేది. ఆ బాధ తప్పింది. మాలాంటి వాళ్లకు సురక్ష శిబిరాలు ఉపయోగపడుతున్నాయి.

-నస్రీన్, ఐరాల

పల్లెకొచ్చి సేవ చేస్తున్నారు



ముందు చిన్న జలుబు వచ్చినా ఆస్పత్రికి పరుగులు పెట్టే వాళ్లం. దుడ్డు ఉండే వాళ్లు ప్రైవేటు ఆస్పత్రికి. పేదలు పెద్దాస్పత్రికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు డాక్టర్లే ఊరికొచ్చి పేదల బాగోగులను మంచిగా చూస్తున్నారు. కంటి సమస్య ఉందని చూపించుకోవాలని వెళ్లా. పరీక్షించి కళ్ల ఇద్దాలు ఇచ్చారు. డాక్టర్లు వచ్చి ఓపిగ్గా చూశారు. ఏదైనా పెద్ద సమస్య ఉంటే జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు.

-హేమచంద్ర, బంగారుపాళెం

తండ్రిలాగే...



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రి బాటలో నడుస్తున్నారు. పేదల బాగోగులను చూసుకుంటున్నారు. డాక్టర్లను ఏదో రకంగా ఊర్లోకే రప్పిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఊర్లోనే వైద్య పరీక్షలు చేసుకుని జాగ్రత్త పడుతున్నాం. ఈ సురక్ష శిబిరంలోనే నాకున్న కంటి సమస్యను ప్రారంభ దశలో గుర్తించి వైద్యం అందించారు.

-త్రిపుర సుందరి, జీడీనెల్లూరు

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

- పింఛనుదారులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ రూ.3 వేలు చేసిన సీఎం
- ఇప్పటివరకు పింఛన్ వ్యయం రూ.83,556 కోట్లు



లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

సాక్షి, చిత్తూరు: చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మళ్లీ పట్టం కడదామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో గురువారం వైఎస్సార్ పింఛన్ల కానుక పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి ప్రసంగించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3వేలు పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 8 వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో 99.5 శాతం నెరవేర్చారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేశారని గుర్తుచేశారు. పేదరికాన్ని మాత్రమే అర్హతగా నిర్ణయించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతోపాటు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.83,556 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేశామన్నారు. పేదవారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. పాడి రైతులను ఆదుకునే విధంగా పాల మద్దతు ధరను పెంచామన్నారు. గతంలో పేదలను పట్టించుకోని చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టుకుని, పార్టీ కార్యకర్తలకు, బంధువులకు అన్ని పథకాలు కట్టబెట్టారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకువస్తారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో కూడా సీఎంగా జగన్‌కు అండగా నిలవాలని, కుప్పంతోపాటు జిల్లాలోని అన్ని స్థానాల్లో గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు. సమావేశంలో చిత్తూరు మేయర్ అముద, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బి.సురేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్ పర్సన్ శైలజా రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, నగర కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్ర శేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

66 లక్షల మందికి పింఛన్

పేదల కష్టం విన్నాను, నేను ఉన్నాను అని చెప్పిన విధంగా పేదలను సంక్షేమ పథకాలద్వారా ఆదుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 66 లక్షల మందికి పింఛన్ల రూపంలో నెలకు దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

నవరత్నాలతో నవశకం

దేశంలో పేదల గురించి ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి నవశకానికి నాంది పలికారు. సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు చెందిన ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మహిళల పేరు పైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు.

-ఎన్.రెడ్డెప్ప, చిత్తూరు ఎంపీ

పింఛన్‌కు గొప్ప స్థానం

వృద్ధాప్య పింఛన్ క్రింద ప్రతి సంవత్సరం పెంచుతూ ఈ సంవత్సరం రూ.3 వేలు అందించాము. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో పింఛన్ కానుకకు ఒక గొప్ప స్థానం ఉంది. ఈ ఆర్థిక సహాయం వృద్ధులకు, దివ్యాంగులు, వితంతువుల వైద్య అవసరాలకు, రోజువారీ అవసరాలకు ఎంతో ఉపయోగకరం. అర్హులందరికీ పెన్షన్ అందుతుంది.

– ఎస్.షణ్మోహన్, జిల్లా కలెక్టర్

నియోజకవర్గంలో 30 వేల మంది

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దేశంలోనే విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమపాళ్లల్లో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. చిత్తూరు నియోజకవర్గంలో దాదాపు 30 వేల మందికి పెన్షన్ అందిస్తున్నాము. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం.

– ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

ఇంటి వద్దకే..

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3వేలు పింఛన్ అందుతోంది. వలంటీర్ల వ్యవస్థ ద్వారా పింఛన్‌ను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్నాం. ఇది పేదల సంక్షేమ ప్రభుత్వం. ఇచ్చిన మాట తప్పని ఏకైక సీఎం జగన్ పారదర్శక పాలన సాగిస్తున్నారు.

– విజయానందరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్

క్రీడాభివృద్ధికి పెద్దపీట: మంత్రి రోజా



మంత్రి రోజాతో జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు

నగరి : చరిత్రలో ఎన్నడూ లేని విధంగా క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. తన నివాసం వద్ద గురువారం జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వెళ్లే బాలురను ప్రోత్సహించి సాగనంపారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం కారణంగానే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకరుల సంఖ్య పెరిగిందన్నారు. జాతీయ స్థాయిలో 48 కేటగిరీల్లో హాజరయ్యే క్రీడాకారులకు ట్రాక్‌షూట్, షూస్, రిజర్వేషన్‌తో కూడిన రవాణా సౌకర్యం, భోజన వసతి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గతంలో ఇలాంటి వసతులు ఎప్పుడూ కల్పించలేదని చెప్పారు. చాడేపల్లెలో నిర్వహించిన అంతర జిల్లాల పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు వారం రోజులుగా నగరి పట్టణంలో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. క్యాంప్‌లో శిక్షణ పొందినవారు నేడు జాతీయ స్థాయికి వెళుతున్నారని చెప్పారు. క్రీడాకారులు మాట్లాడుతూ తమకు ఎన్నడూ లేని ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. క్రీడాకారుల తరపున ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, కోచ్‌లు ఎస్.మణి, ఎస్.రాజ, సుమన్, చంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రాణీమహల్‌కు ఇక మహర్దశ



రాణీ మహల్‌ను సందరిస్తున్న డీఈవోలు విజయేంద్రబాబు, డాక్టర్ శేఖర్

కార్వేటినగరం: సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన రాణీ మహల్‌కు ఇక మహర్దశ రానుందని, డీఈవోలు విజయేంద్రరావు(చిత్తూరు) డాక్టర్ శేఖర్(తిరుపతి) తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో, కమిషనర్ ఆదేశాల మేరకు రాణీమహల్‌ను వారు గురువారం సందర్శించారు. డీఈవోలు మాట్లాడుతూ వందల ఏళ్లనాటి కార్వేటినగరం సంస్థానాధీశులు కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టిన చారిత్రక కట్టడం శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి రాణీమహల్‌ను జీర్ణోద్ధరణ గావించాలని పురావస్తుశాఖ అధికారులకు వివరించారని చెప్పారు. స్పందించిన కమిషనర్ రాణీమహల్ స్థితిగతులను పరిశీలించి వాటి వివరాలను సేకరించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాణీ మహల్‌ను పాఠశాలగా వినియోగించుకోవడంతో ప్రభుత్వం మరింత శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఆర్కే ఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, ఉమాశంకర్, విశ్రాంతి హెచ్‌ఎం విజయకుమార్ పిళ్లై, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కంచెలో చిక్కుకుని జింక మృతి


మృతి చెందిన జింక

శాంతిపురం: చెంగుబళ్ల పంచాయతీలోని సోగడబళ్ల వద్ద పొలానికి వేసిన కంచెలో చిక్కుకుని బుధవారం రాత్రి ఓ జింక మృతి చెందింది. ఉదయం గమనించిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. జింక కళేబరాన్ని పరిశీలించిన అటవీశాఖ సిబ్బంది దాని వయసు దాదాపు రెండేళ్లు, బరువు 75 కిలోలు ఉంటుందని తేల్చారు. జింక మృతదేహాన్ని కుప్పం తరలించారు.

6న అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎంపిక చేసిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు ఈ నెల 06 న శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్స్‌కు కలెక్టరేట్ నుంచి ఆదేశాలు పంపించారు. త్వరలో నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్, ఈవీఎం, బ్యాలెట్ పేపర్లు, ఎంసీసీ, ఐటీ అప్లికేషన్స్ తదితర విభాగాలకు మాస్టర్ ట్రైనర్స్ ఎంపిక చేశారు. వారందరికీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ చేత శిక్షణ ఇవ్వనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే శిక్షణకు ఎంపిక చేసిన అసెంబ్లీస్థాయి మాస్టర్ ట్రైనర్స్ ఖచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుందని అధికారులు ఆదేశించారు.


జిల్లా మైనారిటీ అధ్యక్షుడిగా సయ్యద్‌సర్దార్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్‌సర్దార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు గృహయోగం

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత ఉన్న పేదలందరికీ పక్కా ఇళ్ల పథకంలో ఉచితంగా పట్టా ఇచ్చి ఇళ్లను కూడా ప్రభుత్వమే నిర్మించి ఇచ్చింది. లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రాంతాల్లో ఇంటి స్థలాలను కేటాయించారు. ఏళ్ల తరబడి సొంతంగా గృహాలు లేని ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన గృహాల్లో నివాసం ఉంటున్నారు. పేదలందరికీ పక్కా ఇళ్ల పథకంలో లబ్ధి పొందిన ప్రజల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

జనవాక్కు


ప్రభుత్వం నిర్మించిన పక్కా గృహాలు

వంటగదిలో ఉండేవాళ్లం



ఉండడానికి ఇల్లు లేక గ్రామస్తులను వేడుకుని ఊర్లో వృథాగా ఉన్న స్కూలు వంట గదిలో చాలా సంవత్సరాలు నివాసం ఉన్నాం. నా భర్త వికాస్ తాపీ మేస్త్రీగా పనిచేస్తారు. వచ్చే డబ్బులు అంతంత మాత్రమే. మాకు ఐదుగురు ఆడబిడ్డలు. గతంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. జగనన్న సీఎం అయ్యాక మా చిరకాల కోరిక నెరవేరింది. ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉచితంగా విలువైన స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సహాయం చేసింది. సీఎం చేసిన మేలు వల్లే మాకు ప్రస్తుతం ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి పని పూర్తి చేసి కొత్త ఇంట్లో సంతోషంగా ఉంటున్నాం.

– జ్యోతిదేవి, పొన్నేపల్లి, శాంతిపురం మండలం

మా కల నెరవేరింది



కొన్నేళ్లనాటి సొంతింటి కల ఈ సర్కారులో నెరవేరింది. నేను, నా భర్త సోమప్ప కూలి పనులు చేస్తుంటాం. ఆ కూలి పనులతో వచ్చే డబ్బు కుటుంబం గడవడానికే సరిపోతుంది. ఇంకెప్పుడు ఇల్లు కడతామో అనుకున్నాం. సొంతంగా ఇల్లు కట్టుకోవాలని కలలు కంటున్నాం. మా కల ఇప్పటికి నెరవేరింది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వచ్చి దరఖాస్తులు పూర్తి చేసి తీసుకెళ్లాడు. కొద్ది రోజుల తర్వాత ఉచితంగా ఇంటి పట్టాతోపాటు ఇళ్లను మంజూరు చేయించి శుభవార్త చెప్పారు. ఇంటి పని పూర్తయింది. త్వరలో గృహప్రవేశం చేస్తాం. సీఎం చేసిన మేలును ఎప్పటికీ మరిచిపోం.

– రాజేశ్వరి, పొన్నేపల్లి, శాంతిపురం మండలం

జగనన్న చేసిన మేలు



సొంతింటి కోసం ఏ కార్యాలయానికి గానీ, ప్రజా ప్రతినిధుల వద్దకూ వెళ్లకుండానే మాకు రాష్ట్ర ప్రభుత్వం సొంతిల్లును మంజూరు చేసింది. ఏడుగురు బిడ్డలతో పాత పెంకుటింట్లో సంవత్సరాల కొద్దీ నివసించాం. వానా కాలం వస్తే పెంకుటిల్లు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. అయినప్పటికీ చాలా ఏళ్లు ఆ ఇంట్లోనే ఉన్నాం. కూరగాయలు అమ్ముకోవడమే మా బతుకుదెరువు. కొత్తగా ఇల్లు కట్టుకుందామంటే మా ఆర్థిక స్తోమత ఏ మాత్రం సరిపోదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మాకు జగనన్న మేలు చేశారు. ఆయన చేసిన మేలు వల్లే సొంతంగా ఇల్లు నిర్మించుకోగలిగాము. సీఎంకు రుణపడి ఉంటాం.

– ఫాజుల్లాబీ, ఎంకే.పురం, శాంతిపురం మండలం

పింఛన్ పెంచిన ఘనత జగనన్నదే


గుడుపల్లెలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: ఇచ్చిన మాట ప్రకారమే పింఛన్ల మొత్తాన్ని, పింఛనుదారుల సంఖ్యను ఏటా పెంచుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం పెంచిన పింఛన్లు ఇచ్చే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో అందజేస్తున్న సామాజిక పింఛన్లు దేశంలోనే ఆదర్శమని చెప్పారు. ఇలా ప్రతి నెలా ఇచ్చే పింఛన్లను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు సాధ్యం అన్నారు. గతంలో చంద్రబాబు నాయకత్వంలో నెలకు రూ.200 ఇచ్చే పింఛను కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కానీ జగనన్న వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. హైదరాబాద్‌లో ఉండి చుట్టపుచూపుగా వచ్చి సాయంత్రం సమయాల్లో మీటింగులు పెట్టి మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లే నాయకుడిని ఎన్నుకుంటే అభివృద్ధి జరుగుతుందా అని ప్రశ్నించారు. తాను నిరంతరం కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్ రామకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ క్రిష్ణమూర్తి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఈవోపీఆర్‌డీ శంకర్ సర్పంచ్‌లు రామమూర్తి, చెన్నరాయన్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రసజ్ఞ

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న శ్రీరంగరాజపురం మండలానికి చెందిన రసజ్ఞ(16) గురువారం హాస్టల్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందింది. స్థానిక సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు, ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 30న రసజ్ఞ తన పుట్టినరోజు కోసం స్వగ్రామానికి వెళ్లింది. అక్కడి నుంచి ఈ నెల 2వ తేదీన హాస్టల్‌కు వచ్చింది. గురువారం ఉదయం తనకు ఒళ్లు నొప్పులుగా ఉన్నాయంటూ స్నేహితులకు చెప్పి వారితో సెలవుచీటీనిచ్చి తన గదిలోనే ఉండిపోయింది. తరగతులు ప్రారంభమైన కాసేపటికి హాస్టల్ వార్డెన్ గదుల తనిఖీకి వచ్చారు. గదిలో బాలిక మూలుగుతున్న శబ్దం విని డోర్ తెరిచి చూశారు. ఫ్యాన్‌కు వేలాడుతూ కిందపడిన బాలికను గమనించారు. దీంతో వెంటనే స్థానిక పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది బాలికను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సహదేవి వివరాలను తెలుసుకున్నారు. అప్పటికే ఆస్పత్రి వద్దకు చేరుకున్న మృతురాలి తల్లిని విచారించగా తమ బిడ్డకు ఎలాంటి సమస్యలు లేవని సంతోషంగా ఇంటినుంచి వచ్చిందని తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

ఐరాల: మామిడిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండలంలోని కామినాయనిపల్లెలో మామిడి రైతుల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి అధ్యక్షతన ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కలిపించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, మామిడిలో పూత నుంచి కోత వరకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి రైతులు ఆచరించవలసిన సస్యరక్షణపై వివరించారు. మామిడి పంటను తేనె మంచు, తామర పురుగు, పండు ఈగ ఆశిస్తాయని వివరించారు. వీటి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలిపారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ శేష్ కిరణ్ మాట్లాడుతూ మామిడిలో ప్రధానంగా ఆంత్రాక్నోస్, బూడిద తెగుళ్లు ఆశిస్తాయని పేర్కొన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సాగరిక, వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని సైకిలిస్ట్ మృతి

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని జాతీ య రహదారి, చిల్లకూరు సర్వీసు రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చిల్లకూరు అరుంధతీయవాడకు చెందిన మంగళపూరి ముత్యాలయ్య(49) కూలి పనుల నిమిత్తం ఇంటి నుంచి సైకిల్‌పై బయలుదేరాడు. చిల్లకూరు సర్వీసు రోడ్డులో వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ముత్యాలయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులను పరిశీలించండి


జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అసైన్‌మెంట్ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆయా మండలాల్లో అసైన్‌మెంట్ భూముల పంపిణీకి అర్హత ఉన్న లబ్ధిదారుల పేర్ల ప్రతిపాదనలను కలెక్టరేట్‌కు పంపాలని చెప్పారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయాల్సిన ఇంటివద్దకే రేషన్‌ను పకడ్బందీగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కసరత్తులో ఈ నెల 22న ప్రచురించే తుది ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కసరత్తు ఈ నెల 12వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

1. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది. తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.
a) అంగన్వాడీ హెల్పర్లను అంగన్వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.
b) అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్వాడీ హెల్పర్లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయుటానికి మెమో నం. 2303564/2023/PROG-I-A1, Dt 20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.
c) అంగన్వాడీ వర్కర్లు&హెల్పర్ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ. 40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.
d) అద్దెలు (Rs.66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWC ల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్లు విడుదల చేయబడ్డాయి.
2. అంతేకాకుండా 2019 నుండి
a) అంగన్వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.
b) 2013 నుంచి అంగన్వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.
C) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.
d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ. 1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.
e) ఈ ఏడాది నుంచి అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.
f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.
3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్ అందించాలి.
4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWWలు & AWH లు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు–6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ఆరోగ్య పేరమీటర్ల పై పర్యవేక్షణ జరగటం లేదు.
5. పైన పేర్కొన్న అంశాల దృష్ట్యా, అంగన్వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగనవాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.
6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్వాడి సెంటర్లను నిర్వహించటానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.
7. కేబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడాఅందరు అంగన్వాడి కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్ ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు. 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా(ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీన్ని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగ విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింప చెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనల అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు: జిల్లా కలెక్టరు మరియు మెజిస్ట్రేట్, చిత్తూరు

సిద్ధార్థలో ముందస్తు సంక్రాంతి



అధ్యాపకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న అశోకరాజు, సంక్రాంతి సంబరాలలో అశోకరాజు, అధ్యాపకులు

నారాయణవనం: మండలంలోని సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. గురువారం ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మధ్యాహ్నం ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల గ్రామాలలో భక్తిశ్రద్ధలతో నాలుగు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పడుగ మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో సాంకేతిక విద్యను అందించడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్‌ను అందివ్వడానికి అహర్నిశలు శ్రమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అశోకరాజు అధ్యాపకులు, విద్యార్థుల మధ్య కేక్‌ను కట్ చేసి తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కళాశాలల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, రమేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పారదర్శకంగా రవాణా సేవలు

- ఆటోమెటిక్ ట్రాక్ సిస్టంతో డ్రైవింగ్ టెస్ట్
- త్వరలో వాహనాల ఫిట్‌నెస్‌కు ట్రాక్
- ఆన్‌లైన్ ద్వారా రవాణా సేవలకు ప్రాధాన్యత
- అవినీతి ఆటలకు చెక్ పెడుతున్నాం
- సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు
- 'సాక్షి'తో డీటీసీ నిరంజన్‌రెడ్డి


డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లా రవాణాశాఖ సేవలను పారదర్శకంగా అమలయ్యేలా చూస్తున్నామని డీటీసీ నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా నేరుగా సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. డ్రైవింగ్, వాహన పరీక్ష తదితరాలు టెక్నాలజీతో నడుస్తున్నట్టు పేర్కొన్నారు. అవినీతి ఆటలకు చెక్ పెడుతున్నామని, సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆయన గురువారం సాక్షితో మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: రవాణా శాఖలో సేవలు ఏ విధంగా అమలవుతున్నాయి?

జవాబు: కొత్త విధానాలొచ్చాయి. చిన్న పనికి కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందే. తద్వారా ఎంపిక చేసుకున్న సేవలను సులభతరంగా పొందుతున్నారు. కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. దీనిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలి.

ప్రశ్న: ఆటోమెటిక్ సిస్టంతో ఇబ్బందులున్నాయా..?

జవాబు: జిల్లా కేంద్రంలో మూడేళ్లకు పైగా ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాకింగ్ సిస్టం నడుస్తోంది. దీంతో ఎంవీఐల ప్రమేయం లేకుండానే పనులు జరుగుతున్నాయి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. డ్రైవింగ్‌పై పట్టు, ట్రాకింగ్, రోడ్డు నియమావళిపై అవగాహన ఉంటే సులభతరంగా డ్రైవింగ్ శిక్షణను పూర్తి చేయవచ్చు. పట్టు తప్పితే మళ్లీ స్లాట్‌కు వెళ్లి రావాల్సిందే.

ప్రశ్న: ఫిట్‌నెస్ టెస్టుల పరిస్థితి?

జవాబు: వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష ప్రస్తుతానికి మాన్యువల్‌గానే జరుగుతోంది. ఎంవీఐలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ విధానానికి ప్రభు త్వం త్వరలో స్వస్తి పలకనుంది. ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ మాదిరిగానే ఫిట్‌నెస్ ట్రాకింగ్ సిస్టంను తీసుకురానుంది.

ప్రశ్న: అవినీతి, అక్రమాలపై చర్యలు?

జవాబు : ఆన్‌లైన్ సేవలతో అవినీతి, అక్రమాలకు కళ్లెం పడుతోంది. శాఖలో వస్తున్న ఆ రోపణలను కూడా లోతుగా విచారిస్తున్నాం. అధికారులు, సిబ్బందిని విభాగాల వారీగా మారుస్తు న్నాం. ఫిర్యా దులొస్తే విచారించి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

జవాబు : రవాణా శాఖలో సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారానే పొందవచ్చు. కొంతమంది ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయాలి. లైసెన్స్ లేకుండా బండి నడపకూడదు. ఈ సేవలను సద్వినియోగం చేసుకుని డ్రైవింగ్ లైసెన్సు తీసుకోండి.